ప్రజా అవసరాల కోసమే ట్రంక్‌లైన్ నిర్మాణం

మన్సూరాబాద్: ప్రజా అవసరాల కోసమే ట్రంక్‌లైన్లు నిర్మిస్తున్నామని, ఇందుకోసం మదర్ డైరీ సభ్యులు సహకరించాల్సిందేనని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. హయత్‌నగర్ డివిజన్ పరిధి సిద్ధి వినాయకనగర్‌కాలనీలో జరుగుతున్న ట్రంక్‌లైన్ పనులను జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ట్రంక్‌లైన్ మదర్‌డైరీ నుంచి కుంట్లూర్ వరకు కొనసాగుతుందని చెప్పారు. ఎట్టి పరిస్థితిల్లోనూ మదర్‌డైరీ నుంచే ట్రంక్‌లైన్ వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, శ్రీధర్‌గౌడ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మరోసారి ఎమ్మెల్యే చర్చలు

లింగోజిగూడ: ట్రంక్‌లైన్ నిర్మాణ పనుల కోసం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సోమవారం మదర్ డైరీ సభ్యులతో మరోసారి సమావేశమయ్యారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, వాటర్ వర్క్స్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

త్రిపుర గవర్నర్‌కు శుభాకాంక్షలు


ఇంద్రసేనారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న సురేందర్‌రెడ్డి

సైదాబాద్: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డితో పాటు మలక్‌పేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇంద్రసేనారెడ్డికి సురేందర్‌రెడ్డి జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు..

మలక్‌పేట: త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని సోమవారం మూసారంబాగ్ బీజేపీ నేతలు మలక్‌పేటలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ భాగ్యనగర్ జిల్లా కోశాధికారి గవర్నర్‌ను సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేశ్, జక్కా మోహన్‌రెడ్డి, రాముయాదవ్ పాల్గొన్నారు.

సన్మానం..

ఎల్‌బీనగర్: ఇంద్రాసేనరెడ్డిని కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు కృష్ణాది శేషు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం, ఎంఎస్‌రాజు, రాంబాబు ఉన్నారు.

ఎంవీ యాక్ట్ రద్దు కోసం నేడు సదస్సు

మన్సూరాబాద్: ఎంవీ యాక్ట్ 2019ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆటోనగర్ లారీ ఓనర్స్ సంక్షేమ సంఘం, ఆటోనగర్ మెకానిక్ అండ్ టెక్నికల్ వర్కర్స్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో నేడు సదస్సు జరగనుంది. ఆటోనగర్‌లోని గంగా జమున హోటల్ వద్ద సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎండీ సలావుద్దీన్, నందగిరి ఆంజనేయులు తెలిపారు. ఈమేరకు కరపత్రాలను సోమవారం ఆటోనగర్‌లోని మెకానిక్ షెడ్స్, లారీ యజమానులకు అందించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ప్రమాదాలు తగ్గించాలనే కారణంతో కేంద్ర ప్రభుత్వం ఎంవీ యాక్ట్–2019 తీసుకొచ్చిందన్నారు. ప్రమాదం జరిగితే వేల రూపాయాల జరిమానాతో పాటు జైలు శిక్షలు ఉంటాయన్న భయాందోళనలో డ్రైవర్లు ఉన్నారని తెలిపారు. ఎంవీ యాక్ట్‌ను రద్దు చేయాలని గత నాలుగేళ్లగా పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని.. పైగా భారత న్యాయ సంహిత చట్టాన్ని తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు జరిగే సదస్సుకు అధిక సంఖ్యలో డ్రైవర్లు, మెకానిక్ సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్ ప్రారంభం


సెంటర్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ గాయత్రీ కామినేని తదితరులు

మన్సూరాబాద్: రక్త సంబంధిత వ్యాధుల చికిత్స నిమిత్తం ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌లో అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి కామినేని హాస్పిటల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ గాయత్రీ కామినేని.. బోన్‌మ్యారో, బీఎంటీ విభాగ డైరెక్టర్ డాక్టర్ సచిన్‌జాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ గాయత్రీ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రక్తహీనతలు పెరుగుతున్న నేపథ్యంలో అధునాతన చికిత్స కేంద్రాల ఏర్పాటు కీలకమన్నారు. కార్యక్రమంలో కామినేని హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దారుఢ్యం

ఎల్‌బీనగర్: శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. మన్నే కిరణ్‌కుమార్ జ్ఞాపకార్థం సోమవారం ఛత్రపతి శివాజీ గ్రౌండ్‌లో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లోని విజేతలకు కార్పొరేటర్ లచ్చిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, రవిశంకర్, చిన్నయాదవ్, భార్గవ్, దిలీప్, బాల తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్

బస్తీ దవఖానను పరిశీలించిన వైద్య బృందం

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలో సాహెబ్‌నగర్ బస్తీ దవాఖానాను సోమవారం కార్పొరేటర్ లచ్చిరెడ్డితో కలిసి జాతీయ వైద్య బృందం వైద్యులు రాజ్యలక్ష్మి, శ్వేత పరిశీలించారు. ఆస్పత్రిలో కొనసాగుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో వైద్యులు అనిత, వినోద్, ధరణి, సత్యప్రకాశ్, మనీషా, సిబ్బంది వెంకట్ రెడ్డి, బాలకృష్ణ ఉన్నారు.

విద్యార్థినుల ఆత్మహత్యలపై ఫిర్యాదు


ఫిర్యాదుపత్రం చూపిస్తున్న విద్యార్థి నాయకులు

మలక్‌పేట: యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సీ సంక్షేమ హాస్టల్లో పదో తరగతి విద్యార్థినుల ఆత్మహత్యలపై విచారణ జరిపించాలని కోరుతూ విద్యార్థి నాయకులు సోమవారం మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్(టీఎస్ఎస్ఏ) గ్రేటర్ అధ్యక్షుడు నక్క వెంకటేశ్, తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జాక్ రాష్ట్ర అధ్యక్షుడు వలిగొండ నర్సింహ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ కందుకూరు డివిజన్ సభ్యుడు జంతుక శంకర్ తదితరులున్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

చాదర్‌ఘాట్: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని చాదర్‌ఘాట్ సీఐ ప్రకాశ్‌రెడ్డి అన్నారు. చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో ముత్తూట్ ఫైనాన్స్ సౌజన్యంతో రూ.7 లక్షలతో నల్లగొండ చౌరస్తా, మెరీడియన్ ఫంక్షన్ హాల్, ఫైర్ స్టేషన్ లైన్, అక్బర్‌బాగ్, ఆనంద్ నగర్ చౌరస్తా, డీ మార్ట్, చర్మాస్, న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్, వాణి కళాశాల పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ప్రతీ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధులు కందుకూరి శ్రీనివాస్, అబ్రహం జాన్, లక్ష్మీనారాయణ, లోకేశ్ రెడ్డి పాల్గొన్నారు.


సీసీ కెమెరాలు ప్రారంభించిన చాదర్‌ఘాట్ సీఐ

చెత్త కుప్పలే!

ఎల్‌బీనగర్ పరిధిలో అనేక ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. హస్తినాపురం, చంపాపేట, లింగోజిగూడ, వనస్థలిపురం డివిజన్లలోనూ ఇదే స్థితి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం.. కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యంతో రోడ్లపైనే చెత్త పేరుకుపోతోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వనస్థలిపురంలోని క్రాంతి హిల్స్ కాలనీ ప్లేగ్రౌండ్, దానికి ఎదురుగా ఉన్న బహిరంగ ప్రదేశం మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. – హస్తినాపురం


ఓపెన్ ప్లేస్‌లో వ్యర్థాలు


సుష్మా రోడ్డులో పేరుకుపోయిన చెట్ల కొమ్మలు


రోడ్డు మీదే చెట్ల కొమ్మలు


ఇళ్ల మధ్యే పేరుకుపోయిన చెత్త

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన


కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్

వనస్థలిపురం: హస్తినాపురం ఈస్ట్ కాలనీ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం హస్తినాపురం ఈస్ట్ కాలనీలో రూ.20.60 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా.. పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కె.భూపత్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కృష్ణయ్యగౌడ్, అనంత్‌రెడ్డి, మణెమ్మ, విజయలక్ష్మి, రాజవర్ధన్‌రెడ్డి, సత్తిరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు


డ్రైవర్లకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

మలక్‌పేట: విధి నిర్వాహణలో బిజీగా ఉండే డ్రైవర్లు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని మలక్‌పేట ఈస్ట్ జోన్ ఆర్టీఓ వెదిరె సుభాశ్ చంద్రారెడ్డి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మూసారంబాగ్ కార్యాలయంలో డ్రైవర్లకు కోసం ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరం ఆర్టీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సురక్షిత ప్రయాణం కోసం రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. గ్లోబల్ ఐ ఆస్పత్రి కంటి వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంవీఐలు రమేశ్‌బాబు, అరుణ, ఉమ, నరేంద్రపాల్ సింగ్, ఏఎంవీఐలు రజినీ, సైదా, ఏఓలు విజయ్‌కుమార్, ప్రవీణ్, మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న చంద్రమోహన్‌రెడ్డి

హస్తినాపురం: కాలనీలో ప్రధాన సమస్యల పరిష్కారంతో పాటు కనీస వసతులు ఏర్పాటు కోసం కృషి చేస్తానని అగ్రికల్చర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కాలనీలో సంక్షేమ సంఘం కమిటీ సభ్యులతో కలిసి ఆయన పర్యటించారు. సమస్యలను కార్పొరేటర్ సుజాత నాయక్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి జితేందర్‌రెడ్డి తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నాగోలు: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు.. నాగోలు చౌరస్తాలో ఈ నెల 3వ తేదీన ఓ వ్యక్తి స్పృహ కోల్పోయి పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌లో గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, అతడు చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్టు గాంధీ హాస్పిటల్ సిబ్బంది నాగోలుకు పోలీస్ స్టేషన్ సమాచారం అందించారు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. మృతుడి దగ్గర ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణం కోసం వినతి

చైతన్యపురి: డ్రైనేజీ పైపులైన్ల కోసం తవ్విన రహదారుల స్థానంలో నూతన సీసీ రోడ్లు నిర్మించాలని గౌతంనగర్ ప్రజలతో కలిసి గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి జోనల్ కమిషనర్ పంకజకు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆరు నెలల క్రితం నూతన డ్రైనేజీ లైన్ వేసేందుకు రోడ్లు తవ్వకాలు చేపట్టారని, అదే సమయంలో నూతన రోడ్డు నిర్మాణం కోసం అనుమతులు కూడా వచ్చాయని తెలిపారు. తవ్వి వదిలేసిన రహదారి మొత్తం గుంతలు ఏర్పడి వాహనాలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు.


జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ తదితరులు

కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ప్రేమ్ నాథ్‌గౌడ్, కాలనీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, స్థానిక బీజేపీ అధ్యక్షుడు జయప్రకాశ్ తదితరులున్నారు.

రహదారిని ఆక్రమిస్తే కఠిన చర్యలు


అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

మన్సూరాబాద్: రహదారిని ఆక్రమించి నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హెచ్చరించారు. హయత్‌నగర్ పరిధిలోని లెక్చరర్స్ కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మాణం జరుపుతున్నారన్న ఫిర్యాదు మేరకు సోమవారం కార్పొరేటర్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా అదనపు అంతస్తులు నిర్మించడమే కాకుండా 5 ఫీట్ల మేర రోడ్డును ఆక్రమించి ఇనుప కంచే ఏర్పాటు చేసినట్టు గుర్తించామన్నారు. హయత్‌నగర్ టౌన్‌ప్లానింగ్ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణం చేపట్టిన సదరు వ్యక్తిపై చర్యలు చేపట్టాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు.

పూడికతీత పనుల పరిశీలన

చైతన్యపురి: డివిజన్‌లో డ్రైనేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్త అన్నారు. విద్యుత్‌నగర్, ఫణిగిరి కాలనీ, సత్యనారాయణపురం కాలనీలో కొనసాగుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, వరద నీటి కాల్వల పూడికతీత పనులను జీహెచ్‌ఎంసి ఏఈ పార్వతితో కలిసి కార్పొరేటర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ లైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు.


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, ఏఈ

కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఏఈ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సురేందర్, జవాన్ నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎన్‌డీపీ పనులు త్వరగా పూర్తిచేయాలి

నాగోలు: ఎస్‌ఎన్‌డీపీ పనులు త్వరగా పూర్తి చేయాలని నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలో జరుగుతున్న ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులను సోమవారం జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ కృష్ణయ్య, డీజీఎం మాధవితో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ.. వాహనాలకు రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నాలా పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అలేఖ్య, స్థానిక నాయకులు శివ, రాజు తదితరులున్నారు.


పనులను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు

32 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

మలక్‌పేట: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని మలక్‌పేట పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మూసారంబాగ్ చౌరస్తాలో సోమవారం ఎస్సై నవీన్, సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఛత్తీస్‌ఘడ్‌లోని బల్దేపూర్‌కు చెందిన లారీ డ్రైవర్ బీరేంద్రకుమార్(28) అంబర్‌పేట నుంచి మూసారంబాగ్ చౌరస్తా మీదుగా ఎల్‌బీనగర్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో లారీ(సీజీ 08 ఏపీ 8158)ని పోలీసులు ఆపి వివరాలు అడగడంతో పొంతన లేని సమాధానాలు చెప్పాడు. దీంతో అనుమానం వచ్చి తనిఖీ చేయగా లారీలో పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా మూసీ నది సమీపంలో రేషన్ బియ్యం లోడ్ చేసినట్టు తెలుసుకున్నారు. ఓల్డ్ మలక్‌పేటకు చెందిన మహ్మద్ రిజ్వాన్‌కు సంబంధించిన రేషన్ బియ్యంగా గుర్తించారు. పోలీసులు పౌర సరఫరాల శాఖ సర్కిల్–1 అధికారులకు సమాచారం అందించారు. లారీలో ఉన్న 690 బియ్యం బస్తాలలో ఉన్న 32 టన్నుల రేషన్ బియ్యం, లారీని స్వాధీనం చేసుకుని కమొడిటీస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఇదిలా ఉండగా రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న మహ్మద్ రిజ్వాన్ పరారీలో ఉన్నట్టు సమాచారం.

పద్మశ్రీ సోమ్‌లాల్ నాయక్‌కు అభినందనలు

ఉప్పల్: హబ్సిగూడకు చెందిన సోమ్‌లాల్ నాయక్‌కు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందజేయడాన్ని హర్షిస్తూ ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి సోమవారం ఆయనను కలిసి అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గణేష్ నాయక్ స్థానికులు, ఇతర కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో (నేడు) మంగళవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని డీఈ హన్మంత్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 వరకు పద్మావతి కాలేజీ, ఇంద్రప్రస్థ ఫేజ్–2, సుబ్రహ్మణ్య నగర్, కరణ్‌బాగ్ పరిసర ప్రాంతాలు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జీఏ పార్క్, కరణ్‌బాగ్, జీఏ కాలనీ, నియో రాయల్ స్కూల్, శ్రీనివాస కమ్యూనిటీ హాల్, రామాలయం, పద్మావతి కల్యాణ మండపం, సాయిరాం కాలనీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్/సరూర్‌నగర్/వనస్థలిపురం: రైతుబజార్లలో కూరగాయల ధరలు(కిలో) ఇలా ఉన్నాయి. టమోటా లోకల్ రూ.23, వంకాయ రూ.18, బెండ రూ.50, పచ్చిమిర్చి రూ.40, కాకర రూ.45, బీర రూ.40, క్యాలీఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.23, క్యారెట్ రూ.25. దొండ రూ.45, ఆలు రూ.21, ఉల్లి రూ.19, గోకర రూ.50, దోస రూ.18, సొర రూ.11, పొట్ల రూ.13, అరటి రూ.9, చిక్కుడు రూ.35, అర్వి రూ.60, మునగ రూ.75, చిలగడదుంప రూ.60, బీట్‌రూట్ రూ.23, కీర రూ.25, ఫ్రెంచ్ బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.60. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

ప్రజావాణికి స్పందన కరువు

చాదర్‌ఘాట్: ప్రతి సోమవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి స్పందన కరువైందని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదని ఆయన స్పష్టం చేశారు. సర్కిల్‌లోని ప్రజలంతా ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో యూసీడీ, ట్యాక్స్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమావేశం వాయిదా

దిల్‌సుఖ్‌నగర్: నేడు(మంగళవారం) నిర్వహించాల్సిన మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమావేశం వాయిదా పడింది. జిల్లెలగూడలోని సామ యాదిరెడ్డి గార్డెన్(ఎస్‌వైఆర్) గార్డెన్‌లో విస్తృత స్థాయి సమావేశం ఉండగా వాయిదా పడినట్లు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి సమావేశ తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.

ఉపేందర్‌రెడ్డికి సన్మానం


ఉపేందర్‌రెడ్డి సన్మానిస్తున్న శివస్వాములు

దిల్‌సుఖ్‌నగర్: ఎల్‌బీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శివ స్వాముల సన్నిధానం కోసం షెడ్ నిర్మించిన రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ చిలుక ఉపేందర్‌రెడ్డిని సోమవారం శివ స్వాములు సన్మానించారు. ఈ సందర్భంగా శివశక్తి నిత్య అన్నదాన సేవ సమితి అధ్యక్షుడు గురుస్వామి కాటం రాజు మాట్లాడుతూ.. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శివస్వాముల సన్నిధానం కోసం అనువైన స్థలం కావాలని ఉపేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో షెడ్డు నిర్మాణం, ఫ్లోరింగ్ కూడా సిద్ధం చేశారని తెలిపారు. కార్యక్రమంలో రాజేశ్‌కుమార్, వెంకటేశ్, జగదీశ్, బాలకృష్ణ, కుమార స్వామి, మల్లేశ్, సంజయ్, సైదులు, బాలరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల కేలండర్ ఆవిష్కరణ


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న సుధీర్‌రెడ్డి తదితరులు

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గ అభివృద్ధి పనుల చిత్రాలతో రూపొందించిన కేలండర్‌ను బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మల్లేపాక యాదగిరి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాగోలు డివిజన్ అధ్యక్షుడు తూర్పాటి చిరంజీవి, డప్పు వినోద్ కుమార్, కాటేపాక సైకిలాబ్, పార్శం శ్రీధర్, ఏర్పుల యాదయ్య, జోగు కృష్ణ, జలంధర్, మల్లెపాక ప్రశాంత్, టీఆర్‌ఎస్ ఎస్సీ విభాగ నాయకులు అనిత, సరోజ, నిర్మల పాల్గొన్నారు.

మా స్థలాలు అన్యాక్రాంతం

ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ హౌసింగ్ సొసైటీ సభ్యులు

సైదాబాద్: కష్టపడి కొనుగోలు చేసిన స్థలాలను తిరిగి తమకు ఇప్పించాలని ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ హౌసింగ్ సొసైటీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ కన్వీనర్ కెఎస్‌ఆర్ మూర్తి మాట్లాడారు. 1981లో అప్పటి ప్రభుత్వం సైదాబాద్ మండలంలోని సింగరేణి కాలనీలో ప్రభుత్వ భూమిని తాము కొనుగోలు చేశామన్నారు. అయితే, సొసైటీకి చెందిన 247 మంది సభ్యులకు చెందిన భూమిలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేశారని చెప్పారు. కబ్జాదారుల నుంచి తమ ప్లాట్లు తిరిగి ఇప్పించాలని ఎన్నోసార్లు ప్రభుత్వాన్ని, కలెక్టర్‌లను, అధికారులను కోరినా స్పందించలేదని విమర్శించారు. ప్లాట్ల యజమానులైనా ఇప్పటికీ అద్దె ఇళ్లల్లో నివసిస్తున్నారని తెలిపారు. న్యాయంగా తమకు రావాల్సిన భూమి కోసం దాదాపు నలభై ఏళ్లుగా న్యాయపోరాటం చేస్తున్నామని ఆవేదన చెందారు. సమస్యపై ఇప్పటికే ప్రజాపాలనలో వినతిపత్రం కూడా అందించామని చెప్పారు. సమావేశంలో సొసైటీ సభ్యులు ఉదయ్ చంద్, బాలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ అసత్య ప్రచారాలను నమ్మొద్దు'


రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: బీఆర్‌ఎస్ నాయకుల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎల్‌బీనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డిపై ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. ప్రజల సంక్షేమానికి కృషి చేయకపోగా ప్రజల సొమ్మును దోచుకున్న బీఆర్‌ఎస్ నాయకుల భరతం పడతామని ఆయన హెచ్చరించారు.